క్లుప్తంగా

ఇంటర్ ప్రాక్టికల్స్ పరిశీలన

భైంసాటౌన్: పట్టణంలోని రెయిన్‌బో, మైనార్టీ జూనియర్ కళాశాలల్లో జరుగుతున్న ఇంటర్ ప్రాక్టికల్స్‌ను మంగళవారం డీఐఈవో పరమేశ్ పరిశీలించారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కళాశాల నిర్వాహకులకు సూచించారు. వారి వెంట సిబ్బంది ఉన్నారు.

అకౌంటింగ్‌పై అవగాహన

భైంసాటౌన్: పట్టణంలోని జీఆర్‌పీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు అకౌంటింగ్‌పై అవగాహన కల్పించారు. కామర్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు జి. రఘు రిసోర్స్ పర్సన్‌గా హాజరై విద్యార్థులకు అకౌంటింగ్, ఫైనాన్స్ రంగాల్లో ఉపాధి అవకాశాల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధాకర్, అధ్యాపకులు సుధాకర్, ఓంప్రకాశ్ తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత



సాయం అందిస్తున్న బీజేపీ నాయకులు

భైంసారూరల్: మండలంలోని హజ్గుల్ గ్రామంలో ఇటీవల ఆనందబాయి ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయిన విషయం తెలిసిందే. మంగళవారం బాధిత కుటుంబాన్ని బీజేపీ నాయకులు శివాజీపటేల్ పరామర్శించారు. అనంతరం ఎమ్మెల్యే రామారావుపటేల్ పంపిన ఆర్థికసాయాన్ని బాధితులకు అందజేశారు. వారి వెంట ఎంపీపీ అబ్దుల్ రజాక్, ప్రకాశ్‌పటేల్, రాము, హన్మాండ్లు, శంకర్ తదితరులు ఉన్నారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ

తానూరు: మండలకేంద్రంలోని భవిత విద్యావనరుల కేంద్రంలో మంగళవారం దివ్యాంగులైన విద్యార్థులకు ఫిజియోథెరపీ నిర్వహించారు. 24 మందికి వైద్యపరీక్షలు చేసి మందులు అందించినట్లు ఫిజియోథెరపిస్ట్ శ్రీనివాస్ తెలిపారు. ప్రతి మంగళవారం భవిత విద్యావనరుల కేంద్రంలో నిర్వహించే శిబిరం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐఆర్‌టీ భూమన్న, రాము తదితరులు పాల్గొన్నారు.

పనులు పరిశీలన

లక్ష్మణచాంద: మండలంలోని కనకాపూర్, బాబాపూర్, నర్సాపూర్ గ్రామాల్లో చేపడుతున్న ఉపాధిహామీ పనులను మంగళవారం ఎంపీడీవో శేఖర్ పరిశీలించారు. ఈసందర్భంగా కూలీలతో మాట్లాడి పలు వివరాలు తెలుసుకున్నారు. అంతకుముందు బాబాపూర్, న్యూకంజర్, బోరిగాం గ్రామాల్లోని నర్సరీలను ఎంపీడీవో పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఏపీవో ప్రేమల, టీఏ నారాయణ తదితరులు ఉన్నారు.

ఉద్యమకారుల ఫోరం నియోజకవర్గ కార్యవర్గం

భైంసాటౌన్: పట్టణంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ముధోల్ నియోజకవర్గ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చైర్మన్ కొట్టే శేఖర్, నిర్మల్ జిల్లా అధ్యక్షుడు ముష్కం రామకృష్ణగౌడ్ ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భోస్లే పండిత్‌రావు, ప్రధాన కార్యదర్శిగా భీంరావ్ డోంగ్రే, గౌరవాధ్యక్షులుగా రవిపాండే, గిరిధర్ జంగ్మే, జనార్దన్ రెడ్డి, కోశాధికారిగా నాగరావు, ఉపాధ్యక్షులుగా కొట్టే హన్మండ్లు, ఉత్తమ్ భాలేరావు, కార్యదర్శిగా మోహన్, 30 మంది సభ్యులను ఎన్నుకున్నారు. చాకేటి లస్మన్న, దుబాయ్ శీను తదితులున్నారు.

నూతన కార్యవర్గం

ఖానాపూర్: పట్టణంలోని బర్కత్‌పుర యూత్ వెల్ఫేర్ సొసైటీ కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కాలనీవాసులు పేర్కొన్నారు. సొసైటీ అధ్యక్షుడిగా మహ్మద్ షోయబ్, ఉపాధ్యక్షులుగా అబ్దుల్ గనీ, మిన్హాజ్, ప్రధాన కార్యదర్శిగా జియా, కార్యదర్శిగా షా కీర్, కోశాధికారిగా అర్షద్ తదితరులు ఎన్నికయ్యారు.

'శ్రీచైతన్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలి'



ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలో అనుమతి లేకుండా నడుపుతున్న శ్రీ చైతన్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ శశి మాట్లాడుతూ నాలుగేళ్లుగా 8, 9, 10 తరగతులకు అనుమతుల్లేకుండా తరగతులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు నిద్ర లేచి పాఠశాల అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రఘు, శశాంక్, వంశీ, సాయిచరణ్, సన్నీ, మున్నా తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి రోడ్లతో అవస్థలు

- రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పనులు పూర్తి చేయించాలని అధికారులకు వేడుకోలు



తవ్వి వదిలేసిన మల్లేశ్వర్‌తండా రోడ్డు



కంకర తేలి అధ్వానంగా జామ్‌గాం-రంజనితండా రోడ్డు

కుభీర్: మండలంలో పలు గ్రామాలకు వెళ్లే బీటీ రోడ్ల నిర్మాణ పనులు నత్త నడకన సాగుతుండటంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి పనులు పూర్తి చేయించాలని వేడుకుంటున్నారు. జిల్లాలో గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఐటీడీఏ నిధులు మంజూరు చేస్తున్నా.. పనులు చేయించడంలో క్షేత్రస్థాయి సిబ్బంది మాత్రం విఫలం అవుతున్నారు.

కుభీర్ మండలంలో 41 గ్రామ పంచాయతీలున్నాయి. మండలంలోని జామ్‌గాం నుంచి రంజనితండా వరకు ఐటీడీఏ నిధులు రూ.రెండు కోట్లతో మూడు కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు పనులు చేపట్టారు. జామ్‌గాం రోడ్డుపై కంకర పోసి వదిలేశారు. దీంతో పలువురు వాహనదారులు అదుపు తప్పి కింద పడుతున్నారు. సిర్పెల్లి ఎక్స్‌రోడ్డు నుంచి మల్లేశ్వర్ తండా వరకు రెండు కిలోమీటర్ల మేర రూ.1.19కోట్లతో బీటీ రోడ్డు పనులు చేపట్టారు. మల్లేశ్వర్ తండా రోడ్డుకు ఇరువైపులా సైడ్ డ్రెయిన్స్ తవ్వి మట్టిని రోడ్డుపై పోసి వదిలేశారు. దీంతో ఈ మార్గంలో వచ్చి వెళ్లే వాహనదారులు దుమ్ముతో ఇబ్బందులు పడుతున్నారు. గతేడాది మే మాసంలో అప్పటి ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ప్రారంభించిన ఈ రోడ్డు పనులు ఇప్పటికీ పూర్తి కాలేదు.

మిగతా గ్రామాల్లోనూ..

పై రెండు మార్గాలే కాక మండలంలోని పలు గ్రామాల రోడ్లు కూడా కంకర తేలి అధ్వానంగా మారాయి. బెల్గాం ఎక్స్‌రోడ్ నుంచి దార్‌కుభీర్ రోడ్డు, కస్రా రోడ్డు, పార్డి(బి) నుంచి భైంసా వెళ్లే రోడ్డు, బెల్గాం రోడ్డు, సిర్పెల్లి వెళ్లే బీటీ రోడ్లు గుంతలమయంగా మారాయి.

ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు..

కంకరతేలి.. గుంతలమయంగా మారిన బీటీ రోడ్లపై రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి వేళ గుంతలు కన్పించక పలువురు ద్విచక్ర వాహనదారులు కింద పడుతున్నారు. వాహనాలు సైతం దెబ్బతింటున్నాయని వాపోతున్నారు. పంచాయతీరాజ్ ఏఈ సూరతేజ మాట్లాడుతూ దార్‌కుభీర్, సిర్పెల్లి, పార్డి(బి) గ్రామాల్లో రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి కానీ టెండర్ ప్రక్రియ పూర్తి చేయలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నాయి



జామ్‌గాం నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న మా తండాకు వెళ్లాలంటే నరకం కనిపిస్తుంది. కంకర తేలడంతో అదుపుతప్పి కింద పడుతున్నాం. సమయం వృథా అవుతుంది. వాహనాలు సైతం దెబ్బతింటున్నాయి.

– జాదవ్ శివరాం, రంజనితండా

పనులు పూర్తి చేయాలి



సిర్పెల్లి- మల్లేశ్వర్ బీటీ రోడ్డు పనులను కాంట్రాక్టర్ నిలిపివేశారు. దాంతో ఈ రోడ్డుపై దుమ్ము ఎక్కువైంది. ఈ మార్గంలోనే మా ఊరికి వెళ్తాం.. అసంపూర్తి పనులతో దుమ్ము లేచి ఎదురు వాహనాలు కన్పించడం లేదు. వెంటనే పనులు పూర్తిచేయాలి.

– జాదవ్ గణపతి, కిషన్‌నాయక్‌తండా

పనులు చేయాలని కాంట్రాక్టర్‌కు నోటీసులిచ్చాం

జామ్‌గాం-రంజనితండా, సిర్పెల్లి ఎక్స్‌రోడ్డు -మల్లేశ్వర్ తండా వరకు బీటీ రోడ్డు పనులు చేపట్టిన కాంట్రాక్టర్ బిల్లులు రాలేదని నిలిపివేశాడు. పనులు చేయాలని చెప్పాం.ఇటీవల నోటీసులు కూడా ఇచ్చాం. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పనులు చేపట్టేలా చూస్తాం.

– ప్రదీప్, ఐటీడీఏ ఏఈ, కుభీర్

గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలి

సోన్: నేటి నుంచి వారం రోజుల పాటు గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి, జెడ్పీ సీఈవో సుధీర్‌కుమార్ అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. చివరి రోజు గ్రామసభ నిర్వహించి మద్యం, గుట్కా వంటి మాదకద్రవ్యాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అంతకుముందు పాక్‌పట్లలో ఎంపీడీఓ మోహన్‌రెడ్డి వ్యక్తిగత మరుగుదొడ్లను పరిశీలించారు.

లక్ష్మణచాంద: మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టనున్నట్లు ఎంపీడీవో శేఖర్ తెలిపారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈసందర్భంగా ఈనెల 7 నుంచి 15 వరకు గ్రామాల్లో చేపట్టే స్పెషల్ శానిటేషన్ ప్రోగ్రాం గురించి వివరించారు. నీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని సూచించారు. మండలంలోని గ్రామాల్లో బుధవారం గ్రామసభలు నిర్వహించాలని ప్రత్యేకాధికారి శ్రీ శ్యామ్‌రావు రాథోడ్ పేర్కొన్నారు. ఎంపీవో నసీరుద్దీన్, ఏపీవో ప్రేమల, తదితరులున్నారు.



సోన్‌: మాట్లాడుతున్న జెడ్పీసీఈఓ సుధీర్‌కుమార్

లోకేశ్వరం: గ్రామాల్లో పారిశుధ్య సమస్యల్లేకుండా చూడాలని ఎంపీడీవో సోలమాన్‌రాజ్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందికి, పంచాయతీ కార్యదర్శులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడారు. రోడ్లపై చెత్త చెదారం లేకుండా మురికి కాలువలను శుభ్రం చేయించాలన్నారు. వీధిదీపాలు, నర్సరీల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వేసవిలో నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఏపీవో జగన్నాథ్, ఈసీ అనిల్ ఉన్నారు.

కుంటాల: ప్రభుత్వం ఈనెల 7 నుంచి 15 వరకు నిర్వహించే ప్రత్యేక పారిశుధ్య పనులను పకడ్బందీగా చేపట్టి ఆదర్శ గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దాలని ఎంపీపీ అప్క గజ్జారాం యాదవ్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. గ్రామాల్లో రహదారులు శుభ్రం చేయడంతోపాటు మురికి కాలువల పూడికతీత, గుంతలు పూడ్చడం, శుక్రవారం డ్రైడేగా పాటించాలని కోరారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారులు ఎజాజ్ అహ్మద్ ఖాన్, దేవేందర్‌రెడ్డి, సోమలింగారెడ్డి, నరేశ్‌గౌడ్, రహీం, అన్నపూర్ణ, నవీన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



లోకేశ్వరంలో మాట్లాడుతున్న సోలమాన్‌రాజ్



కుంటాలలో మాట్లాడుతున్న ఎంపీపీ గజ్జారాం

బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం

కడెం: సీఎం రేవంత్‌రెడ్డిపై చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన వాఖ్యలను కాంగ్రెస్ నాయకులు ఖండించారు. ఈ మేరకు మంగళవారం యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో కడెంలో సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. సుమన్ వెంటనే రేవంత్‌రెడ్డికి బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణాధ్యక్షుడు వాజిద్‌ఖాన్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు రమేశ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు శంకర్, రఫీక్, బబ్లూ, సాగర్, ఇందూర్, రహీం, రాజు, రాజన్న తదితరులు ఉన్నారు.

ఖానాపూర్: పట్టణంలో సీఎంపై సుమన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సుమన్ చిత్రపటానికి చెప్పులతో పూలమాల వేసి ఫ్లెక్సీని దహనం చేశారు. దయానంద్, చిన్నం సత్యం, షబ్బీర్‌పాషా, నిమ్మల రమేశ్, తోట సత్యం, గంగనర్సయ్య, శంకర్, రాజునాయక్, షౌకత్‌పాషా, అశోక్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ముథోల్: మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ ముధోల్ మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ రాంనాథ్‌నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం సీఎంపై సుమన్ వ్యాఖ్యలను ఖండిస్తూ మండల కేంద్రంలో మాట్లాడారు. కాంగ్రెస్ పాలనపై విమర్శలు చేస్తే సహించేంది లేదని హెచ్చరించారు.



కడెంలో దహనం చేస్తున్న నాయకులు

'కేసు నమోదు చేయాలి'

లోకేశ్వరం: సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై కేసు నమోదు చేయాలని మండలంలోని కాంగ్రెస్ నాయకులు లోకేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ కమిటీ మండల అధ్యక్షుడు గడ్డం సుదర్శన్ రెడ్డి, శ్రీనివాస్, షఫీ, గంగాధర్, నవీన్ ఉన్నారు.



ఖానాపూర్‌లో దహనం చేస్తున్న నాయకులు



లోకేశ్వరంలో ఫిర్యాదు చేస్తున్న నాయకులు

ఆలయంలో మాజీ మంత్రి పూజలు

ఖానాపూర్: పట్టణంలోని సాయిబాబా ఆలయంలో మంగళవారం మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పూజలు చేశారు. ఆలయ వార్షికోత్సవంలో భాగంగా ముధోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి, బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్య జాన్సన్‌నాయక్‌తో కలిసి వేడుకలకు హాజరయ్యారు. ఈసందర్భంగా పలువురు ఆలయ కమిటీ సభ్యులు మాజీ మంత్రికి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈనెల 12న జరిగే ఆలయ వార్షికోత్సవానికి 20 క్వింటాళ్ల బియ్యం అందిస్తానని జాన్సన్‌నాయక్ ప్రకటించారు. కార్యక్రమంలో అర్చకులు శశిధర్‌శర్మ, ఆలయ కమిటీ అధ్యక్షుడు అంకం రాజేందర్, సభ్యులు కొక్కుల ప్రదీప్, శేఖరయ్య, ద్యావత్ రాజేశ్వర్, రామునాయక్, అశోక్‌రావు, విలాస్, మల్లేశ్‌గౌడ్, బీసీ రమేశ్ తదితరులు ఉన్నారు.



ఐకేరెడ్డికి స్వాగతం పలుకుతున్న సభ్యులు

పలువురికి పరామర్శ

ఖానాపూర్: మండలంలోని సింగాపూర్ తాజా మాజీ సర్పంచ్ రామకృష్ణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి జిల్లా కేంద్రంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మంగళవారం బాధితుడిని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్య జాన్సన్‌నాయక్ పరామర్శించారు. చికిత్స పొందుతున్న పట్టణంలోని పద్మావతినగర్ కాలనీకి చెందిన హమీద్‌ను సైతం పరామర్శించారు.

భైంసా: బాసర మండల కేంద్రానికి చెందిన ప్రతాప్ బచ్చువార్ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి కుమారులు బచ్చువార్ రవి, బచ్చువార్ గోవింద్‌ను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మోహన్‌రావుపటేల్ పరామర్శించారు. ప్రతాప్ మృతికి కారణాలను అడిగి తెలుసుకున్నారు.

కుంటాల పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాసం..!

- డీసీవోకు తీర్మానప్రతి అందించిన డైరెక్టర్లు



కుంటాలలోని పీఏసీఎస్ భవనం

కుంటాల: కుంటాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) చైర్మన్ సట్ల గజ్జారాంపై పలువురు పాలకవర్గ సభ్యులు అవిశ్వాస తీర్మానం ప్రకటించారు. కుంటాల పీఏసీఎస్‌లో మొత్తం 13 మంది డైరెక్టర్లు ఉన్నారు. ఇందులో ఎనిమిది మంది డైరెక్టర్లు అవిశ్వాసం ప్రవేశపెడుతూ సోమవారం ఇన్‌చార్జి డీసీవో(జిల్లా సహకార అధికారి) నర్సయ్యకు తీర్మాన ప్రతిని అందించారు.

సొంత పార్టీ నుంచే అసమ్మతి సెగ..

పీఏసీఎస్ ఎన్నికలు 2020 ఫిబ్రవరి 15న జరిగాయి. కుంటాల సొసైటీ పరిధిలో కాంగ్రెస్ నుంచి ఆరుగురు.. బీఆర్ఎస్ నుంచి ఏడుగురు డైరెక్టర్లుగా ఎన్నికయ్యారు. పెంచికల్‌పాడ్ నుంచి డైరెక్టర్‌గా ఎన్నికైన లావణ్య కాంగ్రెస్‌కు మద్దతిచ్చింది. దీంతో ఏడుగురు డైరెక్టర్ల మద్దతుతో కుంటాలకు చెందిన సట్ల గజ్జారాం(కాంగ్రెస్) పీఏసీఎస్ చైర్మన్ పదవిని దక్కించుకున్నారు. నాడు ముథోల్ ఎమ్మెల్యేగా విఠల్‌రెడ్డి కొనసాగడంతో గజ్జారాం కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం, ముథోల్ ఎమ్మెల్యేగా రామారావు పటేల్ గెలుపొందడంతో కుంటాల మండలంలో రాజకీయ సమీకరణాలు తారుమారయ్యాయి. సొంత పార్టీ అయిన బీఆర్ఎస్‌కు చెందిన డైరెక్టర్లే చైర్మన్ గజ్జారాంపై అవిశ్వాసం ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది.

మొరం తరలిస్తున్న వాహనాలు పట్టివేత

సారంగపూర్: మండలంలోని చించోలి(బి) మీదుగా అక్రమంగా మొరం తరలిస్తున్న రెండు టిప్పర్లు, ఒక ట్రాక్టర్‌ను మంగళవారం ఆర్‌ఐ ముంతాజ్ సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చించోలి(బి) గుట్ట నుంచి అక్రమంగా మొరం తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో వెళ్లి తనిఖీ చేసి మొరం తరలిస్తున్న వాహనాలను గుర్తించామని పేర్కొన్నారు. ఒక్కో వాహనానికి రూ.5వేల అపరాధ రుసుం విధించామని.. అనుమతుల్లేకుండా మొరం తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వారి వెంట పలువురు సిబ్బంది ఉన్నారు.

అంబేద్కర్ భవనానికి నిధులు కేటాయించండి

కడెం: మండల కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న అంబేద్కర్ భవనానికి నిధులు కేటాయించాలని అంబేద్కర్ భవన నిర్మాణ సాధన కమిటీ నాయకులు మంగళవారం ఉట్నూర్‌లో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును కలిసి వినతిపత్రం సమర్పించారు. చుట్టూ ప్రహరీ, మరుగుదొడ్లు, ఫర్నీచర్, భవనంపై లైబ్రరీ ఏర్పాటుకు రూ.10లక్షలు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ కన్వీనర్ సునారికారి రాజేశ్, కో-కన్వీనర్లు జడ ఇందూర్‌నేత, బొడ్డు గంగన్న, పసుల రాజలింగం, వెంకన్న, లింగన్న తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే బొజ్జుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి

సోన్: గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని బీజేపీ రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో మంగళవారం గావ్‌చలో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 132వ పోలింగ్ బూత్‌లో కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో రాంనాథ్ మాట్లాడారు. బీజేపీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు, ఓటరు లిస్ట్ విశ్లేషణ తదితర అంశాలపై వర్క్‌షాప్ నిర్వహించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో 20 మంది కార్యకర్తలు రక్తదానం చేశారు. రాత్రి బస చేసి బుధవారం ప్రజలకు పథకాలపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ దళిత మోర్చా నాయకులు పోశెట్టి, మోత్కుపల్లి నరేశ్, నర్సయ్య, సంతోష్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కుంటాల: కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల అభివృద్ధి జరిగిందని ప్రవాస కార్యకర్తలు సూర్యవంశీ సాయినాథ్, మల్లారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని లింబా(కె) గ్రామంలో సోమవారం రాత్రి బసచేశారు. మంగళవారం గావ్‌చలో అభియాన్‌లో భాగంగా గ్రామస్తులకు కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అడెల్లు, బీజేపీ బూత్ అధ్యక్షులు మెల్ల సాయి, దత్తుపటేల్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



సోన్‌లో రక్తదానం చేస్తున్న యువకులు

పలువురికి ఘన సన్మానం

నర్సాపూర్(జి): గ్రామాలను అభివృద్ధి చేయడంలో సర్పంచ్‌ల పాత్ర కీలకమని ఎంపీపీ కొండ్ర రేఖ పేర్కొన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని రైతువేదికలో 13 గ్రామాల తాజా మాజీ సర్పంచ్‌లను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అల్లాడి వనజ, ఎంపీఓ శ్రీనివాస్‌గౌడ్, సూపరింటెండెంట్ అనంత విశ్వేశ్వర్, పీఆర్ ఏఈ సూర్యతేజగౌడ్, ఎంపీటీసీ మల్లేశ్, టెక్నికల్ అసిస్టెంట్లు రవీందర్, సతీశ్, కార్యదర్శులు, తాజా మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్‌లో తాజా మాజీ సర్పంచ్ మహేందర్, మాజీ వార్డుసభ్యులను ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ స్వప్న, ప్రత్యేకాధికారి దీప్తి, హెచ్ఎం నరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కుంటాల: మండలంలోని ఓలాలో తాజా మాజీ సర్పంచ్ కనీస్ ఫాతిమాను గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో హైమద్ పాషా, గ్రామపెద్దలు ఏముల నరేశ్‌కుమార్, మంగలి గణేశ్, చాకలి భోజన్న తదితరులు ఉన్నారు.

కుంటాల: ఏఈవోల సంఘం జిల్లా అధ్యక్షుడిగా అశోక్‌కుమార్ ఎన్నికయ్యారు. కాగా వారిని మంగళవారం మండలంలోని ఓలా గ్రామంలో మ్యాక్స్ (రైతుసంఘం) సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో లోలం రామానంద్, ఎగ్గామ్ నర్సింలు, మహమ్మద్ యూనిస్, నర్సయ్య తదితరులు ఉన్నారు.

ఉద్యోగం సాధించిన వ్యక్తికి సన్మానం

ఖానాపూర్: పట్టణంలోని మహాత్మాజ్యోతిబాపూలే బాలుర పాఠశాలలో అవుట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న సుద్దాల సాగర్ ఇటీవల స్టాఫ్‌నర్స్ ఉద్యోగం సాధించాడు. మంగళవారం పాఠశాలలో సాగర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విశ్వేశ్వర్, సిబ్బంది సాగర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



నర్సాపూర్(జి): మాజీ సర్పంచులతో అధికారులు

ప్రత్యేకాధికారులకు..

తానూరు: మండల కేంద్రమైన తానూరు, ఉమ్రి(కే) గ్రామాల్లో ప్రత్యేకాధికారులుగా సూపరింటెండెంట్ వేణుగోపాల్, తహసీల్దార్ లింగంమూర్తి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో వారిని ఘనంగా సన్మానించారు. మాజీ సర్పంచ్‌లు విఠల్, రత్నమాల, పంచాయతీ కార్యదర్శులు జలంసింగ్, వినయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

సారంగపూర్: మండలంలోని తాండ్ర(జి) గ్రామానికి ప్రత్యేకాధికారిగా నియమితులైన ఎంపీవో తిరుపతిరెడ్డిని మంగళవారం పంచాయతీ భవనంలో ఘనంగా సత్కరించారు. గ్రామాభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. సురేందర్, నర్సయ్య, చిన్నయ్య, లక్ష్మారెడ్డి, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

'వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి'

ఖానాపూర్: సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద్‌నాయక్ అన్నారు. మంగళవారం ఆయన ఖానాపూర్‌లో విలేకరులతో మాట్లాడారు. కల్వకుంట్ల బానిసగా ఉన్న సుమన్‌కు రేవంత్‌ను విమర్శించే అర్హత లేదన్నారు. ఇవి పునరావృతమైతే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

తనిఖీ

తానూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ ప్రకారం భోజనం అందించాలని గ్రామ ప్రత్యేకాధికారి లింగంమూర్తి సూచించారు. మంగళవారం ఉమ్రి (కే) గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు వివరాలు తెలుసుకున్నారు.